క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మతల్లి పట్నాలు



కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామంలో రెండురోజులుగా ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి బోనాల ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు పెద్దమ్మ తల్లి ఆయలంలో భక్తులు పూజారులతో పట్నాలు వేయించి పెద్దమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పూజలు చేస్తున్న వేదపండితులు

ధర్మారం: మండలంలోని కొత్తూరు గ్రామంలో శ్రీరామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. పూజారి బందారం శ్రీకాంత్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. అనంతర శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీని ఎన్నుకున్నారు.

బల్దియా సెక్రటరీగా రాజు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ సెక్రటరీగా జి.రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మందమర్రి మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్‌గా పనిచేసిన రాజును, ప్రభుత్వం రామగుండం కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. కాగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసిన ఎం.ఏ.అలీం, గత ఏడాది ఆగస్టు 3న రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించి సెలవులో వెళ్లారు. అలీంను ప్రభుత్వం నిజామాబాద్‌లోని బాన్స్‌వాడ మున్సిపాలిటీకి కమిషనర్‌గా బదిలీ చేయగా శుక్రవారం ఆయన రామగుండం నుంచి రిలీవ్ అయ్యారు.

ఎంపీడీవోకు సన్మానం

సుల్తానాబాద్: మండలంలోని గ్రామపంచాయతీ ఉద్యోగులు ఎంపీడీవో దివ్యదర్శన్ రావును శుక్రవారం సన్మానించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న కోటి వెంకటేశ్, మండల అధ్యక్షుడు ఆసరి రమేశ్, ప్రధాన కార్యదర్శి గసికంటి శ్రీనివాస్, జిల్లా నాయకులు ఆడెపు వెంకటేశ్, మండల కారోబార్లు రామ్‌రెడ్డి, అనురాధ, సాగర్, శ్రీనివాస్, వికాస్, రాజు, సాయినాథ్, శంకర్, రాజేందర్ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థులకు గోల్డ్‌మెడల్



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణప్రియ

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇంటర్నేషనల్ సైన్స్ ఒలింపియాడ్‌లో గోల్డ్ మెడల్స్ సాధించారని ఆ పాఠశాల డైరెక్టర్ ప్రిన్సిపాల్ మాటేటి కృష్ణప్రియ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో వారిని అభినందించారు. పాఠశాల డైరెక్టర్ మాటేటి సంజీవ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్ అందిస్తున్న జీఎం వెంకటేశ్వర్‌రావు

గోదావరిఖని: వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్ శిక్షణ పొందిన అభ్యర్థులకు కార్పొరేట్ హెచ్‌ఆర్‌డీ జీఎం వెంకటేశ్వర్‌రావు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమీపగ్రామాల నిరుద్యోగ యువత, సింగరేణి ఉద్యోగుల పిల్లలు, మాజీ ఉద్యోగుల పిల్లలకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఉచిత డ్రైవింగ్ శిక్షణతోపాటు భోజన, వసతి కల్పించి, నాణ్యమైన శిక్షణ అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు మడ్డి ఎల్లాగౌడ్, సీఎంవోఏఐ అధ్యక్షుడు మల్లేశ్, టీటీసీ డీజీఎం వెంకటరమణ, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా నిరసన



సుల్తానాబాద్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు



రామగుండం: రైల్వేస్టేషన్ ఎదుట రైల్వే కాంట్రాక్టు కార్మికులు



జ్యోతినగర్: నల్లబ్యాడ్జీలతో మజ్దూర్ యూనియన్ నాయకులు



యైటింక్లయిన్‌కాలనీ: ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



రామగిరి: నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు



కాల్వశ్రీరాంపూర్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

జ్యోతినగర్: దేశంలోని అసంఘటితరంగ కార్మికులకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా ప్రాజెక్టు గేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

రామగుండం: తెలంగాణ రైల్వే క్యాజువల్, కాంట్రాక్ట్, ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రామగుండం ఆధ్వర్యంలో శుక్రవారం రామగుండం రైల్వేస్టేషన్‌లో కేంద్ర కమిటీ పిలుపు మేరకు భారీ ర్యాలీ నిర్వహించి రైల్వేస్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో సీఐటీయూ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఆర్జీ–2 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జోన్–2 కాంట్రాక్ట్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుధ్య విభాగంలోని కార్మికులు శుక్రవారం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె చేశారు. బల్దియా కార్యాలయం ఎదుట బైఠాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఎలిగేడు: మండలకేంద్రంలో జీపీ ఉద్యోగ, కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండు ఆవరణలో సమ్మె చేపట్టారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులోని ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్(ఐఎన్టీయూసీ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

రామగిరి: ఆర్జీ–3 ఏరియాలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా యూనియన్ నాయకులు నిరసన తెలిపారు.

జూలపల్లి: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సదయ్యకు వినతిపత్రం అందజేశారు.

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలో జీపీ కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

సీనియర్లు.. జూనియర్లకు ఆదర్శంగా నిలవాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: స్థానిక మెడికల్ కళాశాలలో ఇటీవల జరిగిన ర్యాగింగ్‌కు నిరసనగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద ర్యాగింగ్ భూతం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేణికుంట్ల ప్రీతం మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి ఎంతో మంది విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారని, సీనియర్లు తమ పిచ్చిచేష్టలతో ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్లు జూనియర్లకు ఆదర్శంగా నిలవాలని, ఇలాంటి చర్యలకు పాల్పడొద్దని హితవుపలికారు. కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మొలుగూరి నితిలేశ్, ఓరుగంటి రాహుల్, శంకర్, సాయిచరణ్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

రామగుండం: రామగుండం నియోజకవర్గ పరిధిలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అదనపు కలెక్టర్ అరుణశ్రీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, బీఎల్‌వోల ఇంటింటి సర్వే, నూతన ఓటరు కార్డుల పంపిణీ అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. రామగుండం, అంతర్గాం తహసీల్దార్లు గెరివెన కుమారస్వామి, వనగంటి రామ్మోహన్‌రావు, నాయబ్ తహసీల్దార్లు ఎం.తిరుపతి, ఎస్.విజయ్ హాజరయ్యారు.

గ్రామాల్లో వరిసాగుపై క్షేత్రస్థాయి పరిశీలన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామగుండం: అంతర్గాం మండలం ఎగ్లాస్‌పూర్ క్లస్టర్ పరిధిలోని సోమనపల్లి, విసంపేట గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. వరిసాగులో పైరుకు సోకుతున్న మొగిలిపురుగు, జింకు లోపాలను గుర్తించి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి పైరులో మొగిలిపురుగు, జింక్ లోప సమస్యలను ముందుస్తుగా గుర్తించి నివారణ చర్యలు చేపడితే పంట దిగుబడి పెరుగుతుందని, ఫలితంగా నాణ్యమైన దిగుబడి వస్తుందని అవగాహన కల్పించారు. అంతర్గాం మండల వ్యవసాయాధికారి బూక్య రాంబాబు, మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి రమేశ్, రైతులు శ్రీనివాస్, హన్మయ్య, బర్పటి శ్రీనివాస్ ఉన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన జంగపల్లి సాత్విక 'రైలు ప్రమాద నిరోధకం' అనే అంశంపై, వరదలను పసిగట్టే డిటెక్టర్ అనే అంశాలపై ఉప్పు వైష్ణవి చేసిన ప్రయోగాలు ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికయ్యాయని గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు రూ.10వేల నగదుతో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు విద్యార్థులను, గైడ్ టీచర్ రేష్మాను అభినందించారు. కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, స్రవంతి, నవీన్ ఉన్నారు.

శానిటేషన్ అధికారుల వైఖరిపై నిరసన

రామగుండం: రామగుండం కార్పొరేషన్ శానిటేషన్ అధికారుల వైఖరిని నిరసిస్తూ శుక్రవారం 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ నల్లబ్యాడ్జీ ధరించి నిరసన తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ రామగుండం పట్టణ పరిధిలో 1, 20, 21, 22 డివిజన్లు ఉండగా అన్ని డివిజన్లకు కలిపి ఒక ట్రాక్టర్ వినియోగంలో ఉండగా ప్రతిరోజూ ఏదో సాకుతో రిపేరులో ఉంటుందన్నారు. చెత్తను తరలించే ట్రాక్టర్ నిత్యం రిపేర్ వస్తుండడంతో సకాలంలో చెత్తను తరలించే పరిస్థితి లేకపోగా మరో ట్రాక్టర్‌ను కేటాయించాలని కౌన్సిల్ సమావేశంలో కోరారు. కాగా 8నెలల క్రితం ట్రాక్టర్ కేటాయించినప్పటికీ పారిశుధ్య కార్మికులను ఇవ్వలేదు. ఇదే విషయమై శానిటేషన్ అధికారిని కోరగా వారంరోజుల్లోగా పారిశుధ్య కార్మికులను పంపిస్తామంటూ ఇచ్చిన ట్రాక్టర్‌ను సైతం తీసుకెళ్లారని వాపోయారు. ఈ విషయంలో శానిటేషన్ అధికారి శ్యాంసుందర్ పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కార్పొరేటర్ ఆరోపించారు.

సంక్షిప్త వార్తలు

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

రామగిరి: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని ఎస్సై సందీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు సేవ చేసేందుకు 24గంటలు సిద్ధంగా ఉంటామన్నారు. గతంలో పనిచేసిన కటికె రవిప్రసాద్ బదిలీలో రామగుండం వీఆర్‌కు బదిలీ కాగా అయన స్థానంలో ఆసిఫాబాద్ స్పెషల్ బ్రాంచ్ నుంచి రామగిరికి సందీప్‌కుమార్ బదిలీపై వచ్చారు.

బాధ్యతలు స్వీకరించిన కాల్వశ్రీరాంపూర్ ఎస్సై

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ ఎస్సైగా ఓంకార్‌యాదవ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ములుగు జిల్లా తాడ్వాయి మండలం ఎస్సైగా పనిచేయగా కాల్వశ్రీరాంపూర్‌కు బదిలీపై వచ్చారు.

పొత్కపల్లి ఎస్సైగా అశోక్‌రెడ్డి

ఓదెల: పొత్కపల్లి ఎస్సైగా జి.అశోక్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన ఎస్సై నూతి శ్రీధర్ జూలపల్లికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల వివరాలు, సమస్యాత్మక గ్రామాల గురించి అడిగి తెలుసుకున్నారు.

బాధ్యతలు స్వీకరణ

కమాన్‌పూర్: కమాన్‌పూర్ ఎస్సైగా మామిడాల చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎంపీడీవోగా దేవరకొండ ఉమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ఎన్టీపీసీ ఎస్సైగా ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ఉదయ్‌కిరణ్ బాధ్యతలు శుక్రవారం స్వీకరించారు. ఎన్టీపీసీ ఎస్సైగా విధులు నిర్వహించిన బి.జీవన్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో గోదావరిఖని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఉదయ్‌కిరణ్‌కు ఎన్టీపీసీ ఎస్సైగా బదిలీ ఉత్తర్వులు రాగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.

ఆత్మీయ సత్కారం

జూలపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చి విధుల్లో చేరిన ఎస్సై శ్రీధర్‌ను శుక్రవారం అబ్బాపూర్ మాజీ సర్పంచ్ ఈర్ల మల్లేశం సత్కరించారు. రైతు సంఘం నాయకుడు తీగుల్ల రాజు, కారోబార్ పుట్ట మల్లేశం ఉన్నారు.

ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడికి స్వాగతం

జ్యోతినగర్: ఎన్టీపీసీ ఎన్బీసీ సభ్యుడు సుంకరి మల్లేశంకు ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు బీఎంఎస్ అనుబంధ ఎన్టీపీసీ కార్మిక సంఘ్ నాయకులు స్వాగతం పలికారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రామగుండం ప్రాజెక్టు పర్మనెంట్ టౌన్‌షిప్ జ్యోతిభవన్‌కు చేరుకున్న క్రమంలో ఎన్టీపీసీ కార్మిక సంఘ్ ప్రధాన కార్యదర్శి సాగర్‌రాజు, అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కోశాధికారి సత్యనారాయణరెడ్డి, బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండుతో సమావేశమయ్యారు.

మానసిక ఒత్తిడిని అధిగమిస్తేనే భవిష్యత్

జ్యోతినగర్: విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమిస్తేనే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత భవిష్యత్‌ను పొందుతారని ప్రముఖ సైకాలజిస్ట్ సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో విద్యార్థులకు కౌన్సెలింగ్ తరగతుల నిర్వహణలో పాల్గొని ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రశ్నలకు చక్కని పరిష్కార మార్గాలు తెలియజేశారు. ప్రిన్సిపాల్ జ్ఞానచంద్, హెచ్‌ఎం ఆరంజ్యోతి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

పెద్దపల్లిరూరల్: సమాజంలో రోజురోజుకూ సైబర్ నేరాలు పెరిగి పోతున్నాయని, ప్రజలంతా ఈ నేరాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందని సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాల గురించి వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య, కోఆర్డినేటర్ సంజీవ్, అకడమిక్ డైరెక్టర్ రామకృష్ణ, అర్జున్, కిరణ్మయి, సునీత, అంజయ్య, రామకృష్ణ, తిరుపతి ఉన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



సన్మానిస్తున్న ఎంపీపీ కరుణశ్రీ

ధర్మారం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జయశీల అంకితభావంతో పనిచేసి ప్రత్యేక గుర్తింపు పొందారని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అన్నారు. ధర్మారం ఎంపీడీవోగా పనిచేసి బదిలీ అయిన జయశీలను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో సన్మానించారు. సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాం రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ మోడవేని తిరుపతి, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు పుస్కూరి జితేందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మిట్ట తిరుపతి పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలిగించొద్దు



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమనాయక్

కమాన్‌పూర్: మండలంలోని గుండారం, పేంచికల్‌పేట గ్రామాల్లో 21 నుంచి జరుగనున్న సమ్మక్క జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టాలని మంథని ఆర్డీవో హనుమనాయక్ సూచించారు. మండలంలోని గుండారం గ్రామంలో జాతర కమిటీ సభ్యులు, ఆయా శాఖల అధికారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జాతరలో తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని, వైద్య, పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ ఆరిఫోద్దీన్, ఇన్‌చార్జి ఎంపీడీవో దేవరకొండ ఉమేశ్, డిప్యూటీ తహసీల్దార్ సూదాటి కోటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు, జాతర కమిటీ సభ్యులు పిడుగు శంకర్, కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో సౌకర్యాలు కల్పించాలి



పనులు పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుసూదన్

సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్: సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి సూచించారు. మండలంలోని నీరుకుల్ల గ్రామంలో 21 నుంచి 24 వరకు నిర్వహించే సమ్మక్క జాతర పనులను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. ఇతర ఏర్పాట్లను పరిశీలించారు. మిగతా పనులను రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో చేయాలన్నారు. జాతరకు వెళ్లే భక్తులకు రోడ్డుకు ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావుల వద్ద రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జాతర కమిటీ చైర్మన్ నర్సయ్యగౌడ్, ఈవో శంకర్ కార్యదర్శి సురేందర్‌రావు, డైరెక్టర్ వీరస్వామిగౌడ్, కాంగ్రెస్ నాయకులు చంద్రయ్యగౌడ్ ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న క్యాతం వెంకటరమణ

జ్యోతినగర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలని చెన్నూరు అసెంబ్లీ ప్రభారి క్యాతం వెంకటరమణ అన్నారు. శుక్రవారం ఎన్టీపీసీ రామగుండం పీటీఎస్‌లోని ఓ హాలులో పార్టీ నాయకులతో ఆయన మాట్లాడారు. పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి పోటీ చేసేందుకు అధిష్టానాన్ని కోరారని తెలిపారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన దబ్బెట కమలాకర్, పల్లికొండ నర్సింగ్, జూల విజయ్, గోశిక రమేశ్ పార్టీలోకి రావడంతో స్వాగతించారు. నాయకులు పెద్దపల్లి రవీందర్, మహవాది రామన్న, మాదరవేణి సమ్మయ్య, మిట్టపల్లి సతీశ్, తిరుపతి, సత్యం, సీతకారి చంద్రశేఖర్, స్వప్న నాగరాజు, జనగామ సాగర్ పాల్గొన్నారు.

దుర్వినియోగమైన నిధుల రికవరీపై చర్యలేవి?

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామ పంచాయతీలో పాలకవర్గం అవినీతికి పాల్పడడంతో దుర్వినియోగమైన నిధుల రికవరీకి అధికారుల చర్యలేవీ అంటూ కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ప్రతినిధులు మేర్గు నరేశ్‌గౌడ్, పల్లె శ్రీనివాస్, పైడిపెల్లి వెంకటస్వామి, వేగోళపు వెంకటస్వామి ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. గతేడాది కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ ద్వారా సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామ పంచాయతీ వెచ్చించిన నిధుల వివరాలను సేకరించామన్నారు. ఇందులో రూ.90.03లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టగా వివిధ రకాల నిధుల నుంచి వెచ్చించిన అభివృద్ధి పనుల్లో రూ.1,95,040 అభ్యంతరకర వ్యయం జరిగిన విషయాన్ని గుర్తించినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా అభ్యంతరకర వ్యయాన్ని రికవరీ చేయాలని అధికారులను ఆదేశించినా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మాజీ సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ, మాజీ ఉపసర్పంచ్ కోడిపుంజుల భూమేశ్, అప్పటి జూనియర్ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి నుంచి అధికారులు రికవరీ చేయాలని వారు కోరారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

రామగిరి: ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని, సేంద్రియ కూరగాయల సాగు మార్కెట్లో ఎంతో లాభదాయకమని కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని లద్నాపూర్ గ్రామంలో కృషివిజ్ఞాన కేంద్రం, రామగిరి ఖిలా, సింగరేణి సంస్థ సహకారంతో సేంద్రియ పద్ధతిలో కూరగాయాల సాగు, పండ్ల మొక్కల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు 250 మామిడి, 250 నిమ్మ, 50 ఉసిరి మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఏ ఎస్‌వోటూ జీఎం డీ.బైద్య, కేవీకే శాస్త్రవేత్తల బృందం సభ్యులు వినోద్ కుమార్, వెంకన్న, పోచం పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఏసీపీ



గోదావరిఖని: రామగుండం సబ్ డివిజనల్ ఏసీపీగా మడుత రమేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీపీగా పనిచేసిన తులా శ్రీనివాస్‌రావును ఇటీవల బదిలీ చేశారు. ఆయన స్థానంలో రమేశ్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఏసీపీని కలిసిన సింగరేణి అధికారులు



గోదావరిఖని: గోదావరిఖని ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన మడత రమేశ్‌ను శుక్రవారం ఆర్జీ–1 సింగరేణి అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో పర్సనల్ ఏజీఎం లక్ష్మీనారాయణ, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

సమర్థవంతంగా టెన్త్ పరీక్షలు

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి మాధవి ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, వెహికల్ ఇన్‌చార్జిలు, రిజర్వు అధికారులతో శుక్రవారం ఆమె జిల్లా కేంద్రంలో సమావేశమయ్యారు. వారికి పలు సూచనలిచ్చారు. ప్రతీఒక్కరు బాధ్యత విధులు నిర్వర్తిస్తూ పరీక్షలు సజావుగా సాగేలా సహకరించాలని కోరారు. పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ రాంరెడ్డితోపాటు పలువురు ఎంఈవోలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రాక్టికల్స్..

జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. శుక్రవారం 58 కేంద్రాల్లో ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్షలకు 5,213 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 4,890 మంది హాజరయ్యారని వివరించారు.

జాతరలో బోర్‌వెల్ ఏర్పాటు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం హన్మంతునిపేట సమ్మక్క జాతరలో బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో తాగునీటికి కొంత ఇబ్బంది ఏర్పడుతోందంటూ జాతర కమిటీ చైర్మన్ సుధాకర్‌రావు, నాయకులు బయ్య కొమురయ్య ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బోర్‌వెల్ వేయించారు.